క్లుప్తంగా

రహదారి కోసం నిరసన



వాడబాయి గ్రామస్తులతో కలిసి నిరసనలో పాల్గొన్న గిరిజన సంఘం నాయకులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లుంబేసు పంచాయతీ వాడబాయి గ్రామానికి రోడ్డు నిర్మించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు మండంగి సన్యాసిరావు డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు వాడబాయి గ్రామాన్ని మంగళవారం సందర్శించి, నేటికీ రోడ్డు సదుపాయం లేకపోవడం పట్ల గ్రామస్తులతో కలిసి నిరసన చేపట్టారు. గ్రామానికి గతంలో వేసిన మట్టి రోడ్డు వర్షాలకు కొట్టుకుపోయిందని, ఆసుపత్రికి, వారపు సంతలకు వెళ్లాలన్న, నిత్యవసర సరుకులు కొనుగోలు చేసి గ్రామానికి తరలించాలన్న రోడ్డు లేకపోవడం వల్ల తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అత్యవసర వైద్యం నిమిత్తం డోలీ మోతలు తప్పడం లేదన్నారు. అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు కిల్లక సుబ్బారావు గ్రామస్తులు పాల్గొన్నారు.

నీలకంఠేశ్వరునికి మఖర తోరణం



మఖర తోరణాన్ని నీలకంఠేశ్వరునికి అలంకరిస్తున్న మన్మధరావు దంపతులు

పాలకొండ రూరల్: మండలంలోని కొండాపురం గ్రామంలో వెలసిన శ్రీ నీలకంఠేశ్వరునికి లోహపు మఖర తోరణాన్ని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, నగర పాలకవర్గ సభ్యులు వెలమల మన్మధరావు, గజలక్ష్మి దంపతులు అందించారు. మంగళవారం ఆలయానికి చేరుకున్న వీరు ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా అర్చకులు శంకరరావు నూతన మఖర తోరణాన్ని స్వామి వారికి అలంకరించారు.

సీజ్ చేసిన సారా, మద్యం ధ్వంసం



సీజ్ చేసిన సారా, మద్యం

కురుపాం: నవోదయం 2.0 కార్యక్రమంలో అమలులో భాగంగా సీజ్ చేసిన సారా, మద్యాన్ని విజయనగరం డిప్యూటీ కమిషనర్ వారి ఆదేశాల మేరకు పార్వతీపురం జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్ ఆధ్వర్యంలో ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. 43 కేసులలో పట్టుబడిన 1456 లీటర్ల సారా, 47 కేసులలో పట్టుబడిన 52 లీటర్ల మద్యాన్ని కురుపాం పాత బస్టాండ్ సమీపంలో ధ్వంసం చేసినట్టు పేర్కొన్నారు. దసరా సందర్భంగా ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే సారా ఎన్‌డీపీఎల్ లిక్కర్‌లపై సరిహద్దులో నిరంతర నిఘా పెడుతున్నామని, రాత్రి పూట స్పెషల్ స్క్వాడ్‌ల సహాయంతో నిరంతర గస్తీ నిర్వహిస్తున్నామని తెలిపారు. సారా తయారీ, రవాణా, అమ్మకాలు చేసే వారిపై 6302936599 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రక్తదానంతో ప్రాణదానం

పార్వతీపురం: యువత రక్తదానం చేస్తే మరొకరికి ప్రాణదానం చేసినట్లేనని కర్షక మహర్షి హస్పిటల్ డైరక్టర్ డి.పృథ్వీమోహన్ అన్నారు. మంగళవారం ఆయన జన్మదినం సందర్భంగా ఆస్పత్రిలో అభిమానులు ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన పుట్టిన రోజు వేడుకలను ఇలా అభిమానులు, స్నేహితుల నడుమ నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రక్తదానం శిబిరంలో సేకరించిన రక్తంతో ఎంతోమంది ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందన్నారు. రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో డా.జి.ప్రభాకరరెడ్డి, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రక్తదానంలో పాల్గొన్న యువత

పండగ పూట పప్పు లేనట్టేనా..!

- ఈ నెల కందిపప్పు సరఫరా నిల్
- ఆందోళనలో తెల్ల రేషన్ కార్డుదారులు
- దసరా పూట తప్పని అవస్థలు

సీతంపేట: దసరా, దీపావళి పండగలకు కూడా కందిపప్పు తెల్ల రేషన్ కార్డుదారులకు లేనట్టే కనిపిస్తుంది. రేషన్ డిపోలకు ఇప్పటి వరకు బియ్యం, పంచదార తప్ప ఇతర నిత్యావసర సరుకులు ఏవీ రాలేదు. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళన తప్పడం లేదు. జిల్లాలో 2,71,703 రేషన్ కార్డుదారులు ఉండగా 53 వేల 542 కిలోల కందిపప్పు ప్రతీ నెల సరఫరా చేయాల్సి ఉంది. గత ఆరేడు నెలలుగా సబ్సిడీ కందిపప్పు రాకపోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. సీతంపేట ఏజెన్సీ వంటి కొండ శిఖర గ్రామాల్లో రేషన్‌దారుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. రేషన్ షాపుల ద్వారా పప్పులు వంటివి ఇవ్వకపోవడంతో మైదాన ప్రాంతాలకు వచ్చి కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు. సీతంపేట ఏజెన్సీలో 15వేలకు పైగా రేషన్ లబ్ధిదారులు ఉన్నారు.

వీరందరికీ పండగ పూట కందిపప్పు సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రేషన్ డిపోల ద్వారా కందిపప్పు కిలో రూ.67కు లబ్ధిదారులకు గతంలో పంపిణీ చేసేవారు. రేషన్ సప్లై లేకపోవడంతో బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధర కిలో రూ.130 వరకు నాణ్యతను బట్టి విక్రయిస్తున్నారు. మారుమూల పల్లెల్లో అయితే మరో రూ.10 ఎక్కువగానే ఉంటుంది. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు, కూరగాయల ధరలు పెరగడంతో అవస్థలు తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు. కొద్ది నెలల కిందట వరకు కంది పప్పు కొరత ఉండడంతో మార్కెట్లో కొనుగోలు చేయలేక లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. తాజాగా ప్రభుత్వం రేషన్ కార్డుదారులందరికి గత కొన్ని నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు. కనీసం ఈ నెలలో అయినా ఇస్తారనుకుంటే మొండి చేయి చూపారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. బయట మార్కెట్లో అత్యధిక ధరలకు కొనుగోలు చేయలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు.



కందిపప్పు

జీసీసీ డిపోల ద్వారా విక్రయిస్తారు

జీసీసీ డీఆర్ డిపోల ద్వారా కందిపప్పును మార్కెట్ రేటుకు విక్రయిస్తారు. వాటిని లబ్ధిదారులు కొనుగోలు చేసుకోవాలి. సబ్సిడీ కందిపప్పు ఈ నెల రాలేదు. బియ్యం, పంచదార యథావిధిగా సప్లై ఉంది. పంపిణీ చేస్తాం.

– శ్రీవిద్య, ఇన్‌చార్జ్ సీఎస్‌డీటీ, సీతంపేట

ఇలా చేయడం తగదు

లబ్ధిదారులకు పండగ పూట కూడా కందిపప్పు సరఫరా చేయకపోతే ఎలా? గత కొన్ని నెలలుగా పరిస్థితి ఇంతే. దసరాకు పిల్లాపాపలు, బంధువులతో పండగ చేసుకునే వారు బయట కొనుగోలు చేయాలంటే కష్టమే.

– నిమ్మక అరుణ, సర్పంచ్, టిటుకుపాయి

పాలకొండలో ఆధ్యాత్మిక సందడి



ఘటాలతో తరలివచ్చిన భక్తులు



దుర్గాదేవి అలంకరణలో కోటదుర్గమ్మ

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనం కల్పించారు. దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఘటాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ఆవరణలో సామూహిక కుంకుమ పూజల నిర్వహించారు. ఆరు వేల మందికి ఉచిత అన్నసమారాధన నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో పట్టణంలో ఆధ్యాత్మిక పండగ నెలకొంది. కలెక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి సూర్యనారాయణ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ వీరికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో పట్టణ ప్రధాన రహదారిలో కిలోమీటర్లు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.



కలెక్టర్ దంపతులకు తీర్థ ప్రసాదాలు అందిస్తున్న పురోహితులు



వీరఘట్టం: బిటివాడలో హోమ గుండం వద్ద పూజలు చేస్తున్న భవానీ భక్తులు



భామిని: కుంకుమ పూజలందుకున్న శ్రీలలితా దేవి

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

దసరా సందర్భంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ఊరూ.. వాడా... వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు రోజుకొక రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కుంకుమ పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. దీంతో ఆధ్యాత్మికత నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్



పాలకొండ రూరల్: అష్టాదశ శక్తి పీఠ మండపంలో దుర్గామాతగా దర్శనమిస్తున్న అమ్మవారు



సీతంపేట: చంద్రమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేయడానికి ఘటాలతో వెళ్తున్న భక్తులు



పాలకొండ రూరల్: పుష్పార్చనలు అందుకుంటున్న పోలమాంబ

రెడ్ బుక్‌తో అరాచక పాలన



డిజిటల్ బుక్ పోస్టర్‌ను ప్రారంభించిన పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు

జియ్యమ్మ వలస రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసి కేవలం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను మాత్రమే టార్గెట్ చేశారని మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మంగళవారం ఆమె తన క్యాంపు కార్యాలయంలో పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షితరాజు సమక్షంలో డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెరిచిన డిజిటల్ బుక్‌లో కూటమి పాలనలో అరాచకాలు, అవినీతిపై నమోదు చేసిన ఫిర్యాదులతో పాటు, పార్టీ కార్యకర్తలు కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యేలు, నాయకులపై ఫిర్యాదులు చేసే సందర్భాలు కూడా ఉంటాయని తెలిపారు. మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి పేర్కొన్నట్టు ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న జైళ్లన్నీ పూర్తి స్థాయిలో ఆధునీకరణ చేయాలని, అందుకు కూటమి నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జియ్యమ్మవలస మండల పార్టీ కన్వీనర్ కోట రమేష్ నాయుడు, జెడ్పీటీసీ మూడడ్ల శశికళ, కురుపాం జెడ్పీటీసీ శెట్టి పద్మావతి, బాపూజీ నాయుడు, కేతిరెడ్డి అచ్యుతరావు, లోలుగ నారాయణరావు, బలగ వెంకటరమణ, కిషోర్, కెంగువ వెంకటనాయుడు, ఆర్నిపల్లి వెంకటనాయుడు, ఉషారాణి, రమణమ్మ, సుజాత పాల్గొన్నారు.

పీఎం స్వనిధిని సద్వినియోగం చేసుకోండి

సాలూరు: పీఎం స్వనిధి పథకాన్ని చిరువ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని స్త్రీశిశు, గిరిజనసంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు మున్సిపల్‌కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పీఎం స్వనిధి పథకం లోక కళ్యాణ్ మేళా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వీధి వ్యాపారులు ఆర్థిక సాధికారత సాధించడానికి ఈ పథకం బాగా ఉపయోగడపడుతుందన్నారు. ఈ పథకం ఆవశ్యకతను వివరించారు.

ఉధృతంగా సువర్ణముఖి నీటి ప్రవాహం

సీతానగరం: మండలంలోని సువర్ణముఖి నదిలో ఉధృతంగా నీరు ప్రవహిస్తున్న కారణంగా ప్రమాదం పొంచి ఉన్నందున నదిఒడ్డునున్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ సువర్ణముఖి నదికి ఎగువనున్న ఒడిశా ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తు న్నాయన్నారు. ఎగువ నుంచి నదిలో ప్రవేశించిన నీరు ఉధృతంగా ప్రవహించడం వల్ల కొత్తవలస నుంచి పెదంకలాం వరకు నదికి ఇరువైపులా ఉన్న తామరఖండి, గెడ్డలుప్పి, బుడ్డిపేట, లక్ష్మీపురం, బగ్గందొరవలస, అనంతరాయుడుపేట, బూర్జ ఆవాలవలస, చినంకలాం, చెల్లన్నాయుడువలస, జయంతిరాపురం, చినభోగిలి, అప్పయ్యపేట గ్రామాల ప్రజలు నదిలో దిగవద్దని, పశువులను దించవద్దన్నారు. ఇప్పటికే వీర్వోల ద్వారా గ్రామాల ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని తెలియ జేసినట్లు చెప్పారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా పటిష్ట చర్యలు : డీఎస్పీ

కురుపాం: దసరా రోజు మాలతమ్మ దర్శనానికి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చే నేపథ్యంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని పాలకొండ డీఎస్పీ రాంబాబు సూచించారు. మంగళవారం మాలతమ్మ గుడిని, క్యూ లైన్లు ఏర్పాటును డీఎస్పీ, కురుపాం ఎస్ఐ నారాయణరావు పరిశీలించారు. అనంతరం విజయదశమి సందర్భంగా మాలతమ్మ గుడికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీస్ సిబ్బందికి, ఆలయ కమిటీ సభ్యులకు, స్థానిక యువతకు సూచించారు. ప్రతి సంవత్సరం మాలతమ్మ గుడిలో మొక్కులు తీర్చుకోడానికి రెండు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో భారికేడ్లు ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. అనంతరం మాలతమ్మ గుడిలో డీఎస్పీ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మాలతమ్మ గుడిని, లైన్లు ఏర్పాట్లును పరిశీలించిన డీఎస్పీ, ఎస్ఐ

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

పాలకొండ రూరల్: అగ్నిమాపక కేంద్రం నూతన భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పోలీస్ హౌసింగ్ బోర్డు డీఈఈ టి.కోదండరావు అన్నారు. మంగళవారం పాలకొండ వచ్చిన ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్ క్వార్టర్స్ స్థలాన్ని సందర్శించారు. అనంతరం పనులు జరుగుతున్న ఫైర్ స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నిర్మాణ పనుల్లో రాజీ పడకూడదని, పూర్తి ప్రమాణాలు పాటించాలన్నారు. అయన వెంట సీఐ ఆమిటి ప్రసాద్, హౌసింగ్ బోర్డ్ సహాయ ఇంజనీర్ తరుణ్, ఫైర్ ఎస్ఐ జామి సర్వేశ్వరరావు తదితరులున్నారు.



అగ్నిమాపక కేంద్రం పనులు పరిశీలిస్తున్న పోలీస్ హౌసింగ్ బోర్డు అధికారులు

రూ.లక్ష వితరణ

పాలకొండ రూరల్: స్థానిక సత్యసాయి మందిరం ద్వారా కొనసాగిస్తున్న నిత్య అన్నదాన పథక నిర్వహణకు తమ వంతు సాయంగా నీలమ్మ కాలనీకు చెందిన సూరు శ్రీనిసరావు, శ్రీదేవి దంపతులు రూ.లక్ష వితరణగా అందించారు. మందిరంలో ఈ మొత్తాన్ని సేవా సమితి కన్వీనర్, నిత్య అన్నదాన ట్రస్ట్ సభ్యులు ఆర్.కిషోర్‌కు చెక్ రూపంలో మంగళవారం అందించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ తమ తల్లితండ్రులు తవిటయ్య, లక్ష్మి కోరిక మేరకు అన్నదానానికి తమ వంతు సాయం చేశామన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు ముఖేష్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సేవా సమితి కన్వీనర్‌కు చెక్ అందిస్తున్న శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతులు

వీధి కుక్కలకు యాంటీ ర్యాబిస్ టీకాలు

కురుపాం:

కురుపాం పంచాయతీ పరిధిలో పలు వీధుల్లో ఉన్న 60 కుక్కలకు యాంటీ ర్యాబిస్ టీకాలు వేసినట్టు మండల పశు వైద్యాధికారిణి డా. శైలజ, పంచాయతీ విస్తరణ అధికారి సురేష్, ఉప సర్పంచ్ షేక్ అదిల్ తెలిపారు. వీధి కుక్కల ద్వారా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.



యాంటీ ర్యాబిస్ టీకాలు వేస్తున్న సిబ్బంది

పండగ పూట పస్తులేనా..!

సీతంపేట: ఎస్ఎస్ఏలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు దసరా పండగకు కూడా జీతాలు పడకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. గత రెండు నెలలుగా జీతాలు లేకపోవడంతో దసరా పండగ పూట కూడా పస్తులు ఉండాల్సిందేనా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సీఆర్‌ఎంటీ 99, పీఐటీ 87, ఐఈఆర్‌పీలు 27, డాటా ఎంట్రీ ఆపరేటర్ 14, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు 13, మెసెంజర్స్ 15, సైట్ ఇంజినీర్లు 6, కేజీబీవీ టీచింగ్ స్టాఫ్ 112, నాన్‌టీచింగ్ 154, పీజీటీలు 56 గురు పని చేస్తున్నారు. డీపీవో ఆఫీస్ స్టాఫ్ ఆరుగురు పని చేస్తున్నారు.

వీరందరికీ ఆగస్టు, సెప్టెంబర్ నెల జీతాలు రాకపోవడంతో దసరా పండగ ఎలా చేసుకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్నామని సంబంధిత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీతాలు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

శ్రమదానంతో రహదారి నిర్మాణం

కురుపాం: మండలంలోని ఒబ్బంగి పంచాయతీలోని తొలుంగూడ గిరిజనులు శ్రమదానంతో మంగళవారం తమ రోడ్డును బాగు చేసుకున్నారు. నీలకంఠపురం నుంచి కాకిలి మెయిన్ రోడ్డు నుంచి తోలంగూడ వరకూ రోడ్డు పూర్తిగా పాడైపోయింది. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంత మంది ప్రజాప్రతినిధులకు మొర పెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో గిరిజనులే స్వచ్ఛందంగా శ్రమదానం చేసి బాగు చేసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సాలూరు ఏజెన్సీకి వచ్చి దుగ్గేరు సిరివర రోడ్డు ప్రారంభిస్తూ గిరిజన ప్రాంత రోడ్లన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటికీ ఏజెన్సీల్లో డోలీ మోతలు ఆగలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తొలుంగూడ రోడ్ పూర్తి చేయాలని సీపీఎం పార్టీ నాయకులు, ఒబ్బంగి మాజీ ఎంపీటీసీ అడ్డమేశ్వరరావుతో పాటు స్థానికులు కోరుతున్నారు.



శ్రమదానంతో గిరిజనులు బాగు చేసుకున్న రహదారి

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కళాశాల వేదికపై సందడి చేస్తున్న పూర్వపు విద్యార్థులు

పాలకొండ రూరల్: స్థానిక లార్డ్ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1983–85 మధ్య కాలంలో ఇంటర్ చదువుకున్న పూర్వపు విద్యార్థుల సమ్మేళనం మంగళవారం జరిగింది. దసరా సందర్భంగా సొంత గ్రామాలకు వచ్చిన పూర్వ విద్యార్థులు ఒక్క చోట చేరి సందడి చేశారు. కళాశాల అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఎక్కడెక్కడో వివిధ హోదాల్లో స్థిరపడిన వారంతా గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడిగా గడిపారు. రానున్న రోజుల్లో తాము చదువుకున్న కళాశాల అభివృద్ధికి సహకరించేందుకు నిర్ణయించారు.